ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
7★
గురువారం 13 జూన్ 2024



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు - డీఈవో మాధవి 10లో..

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఊరట 9లో..



కోకా కోలా ప్రతినిధితో మంత్రులు శ్రీధర్‌బాబు, వెంకట్ రెడ్డి, అధికారులు

జిల్లాకు 'కోకా కోలా' యూనిట్

- రూ. 700 కోట్లతో ఏర్పాటుకు ముందుకు వచ్చిన కంపెనీ
- మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో ఏర్పాటు కానున్న పరిశ్రమ
- అడవిసోమన్‌పల్లి, సిరిపురం, గుంజపడుగులో స్థలాల పరిశీలన
- వేల మందికి కలగనున్న ఉపాధి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాకు మరొక పరిశ్రమ రాబోతున్నది. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో జిల్లాలో కోకా కోలా శీతల పానీయాల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధులతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒప్పందం కుదుర్చుకున్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఇద్దరు మంత్రులు అట్లంటాలో జరుగుతున్న ఆటా బిజినెస్ సెమినార్‌లో పాల్గొన్నారు. మూడు రోజుల క్రితం జిల్లాలో 700 రూపాయల కోట్లతో కోకకోలా శీతల పానియాల పరిశ్రమను నెలకొల్పేందుకు ఆ సంస్థ ప్రతినిధి జోనాదన్ రీఫ్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం నుంచి కల్పిస్తామని మంత్రి ప్రతినిధులకు హామీ ఇచ్చారు. జిల్లాలో కోకా కోలా పరిశ్రమ ఏర్పాటుకానున్నదనే వార్తలతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా జిల్లాలోని మూడు, నాలుగు వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కలగనున్నది. కోకా కోలా కంపెనీ ముందుగా పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన భవనాలు, గోదాములు నిర్మించుకుని నీటి వసతిని సమకూర్చుకుని యంత్రాలను బిగించి ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. ఆ కంపెనీ ద్వారా ఉత్పత్తి అయ్యే వివిధ రకాల పానీయాలను ఉత్పత్తి చేసి బాటిళ్లలో నింపి డిస్ట్రిబ్యూ టర్లకు సరఫరా చేయనున్నారు. ఇందుకు అనువుగా ఉండే స్థలాలను మంథని మండలం అడవిసోమన్‌పల్లి, గుంజపడుగు, సిరిపురంలో పరిశీలన చేశారు. మంథనికి ఇరువైపులా మానేరు, గోదావరి నదులు ఉండడంతో నీటి వసతికి పెద్దగా ఇబ్బందులు ఉండవని కంపెనీ ప్రతినిధులు భావిస్తున్నారు. ఆ కారణంగానే ఇక్కడ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారని తెలుస్తున్నది.

● మంథని నియోజకవర్గంలోనే ఏర్పాటు..

రాష్ట్రంలో నెలకొల్పాల్సిన కోకా కోలా పరిశ్రమను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోని మంథని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు కనిష్ఠంగా 100 ఎకరాలు, గరిష్ఠంగా 200 ఎకరాల భూమి అవసరం ఉంటుందని, ప్రధానంగా తాగునీటి వసతి వనరులు అందుబాటులో ఉండాలని కంపెనీ ప్రతినిధులు ప్రభుత్వానికి సూచించారు. భూమి, తాగునీటి వనరులు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తే కోకా కోలా బాట్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని సమాచారం. మంగళవారం కోకా కోలా కంపెనీకి చెందిన హైదరాబాద్ ప్రతినిధులు మంథని రెవెన్యూ అధికారులను సంప్రదించగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంథని మండలంలోని అడవిసోమన్‌పల్లి, సిరిపురం, గుంజపడుగులోగల ప్రభుత్వ స్థలాలను చూపించారు. ప్రతినిధులు ఆ ప్రాంతంలో నీటి వసతి గురించి ఆరా తీయడంతో పాటు ప్రధాన రహదారికి ఎంత దూరంలో ఉంటుంది. పెద్దపెద్ద వాహనాలు వచ్చేందుకు రోడ్డు సౌకర్యం ఉందా, లేదా, తదితర అంశాల గురించి పరిశీలన చేయడంతో పాటు సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా మంథని ఆర్డీవో హనుమా నాయక్‌ను కలిసి మరిన్ని వివరాలు సేకరించారు. మానేరు తీరాన్ని ఆనుకుని అడవిసోమన్‌పల్లి ఉండగా, గోదావరి తీరాన్ని ఆనుకుని సిరిపురం, గుంజపడుగు గ్రామాలు ఉన్నాయి. ఈ మూడు గ్రామాల శివారులో కోకా కోలా పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన ప్రభుత్వ స్థలాలు ఉన్నట్లు గుర్తించారు. ఆ భూముల విషయమై కోకా కోలా ప్రతినిధులు రెవెన్యూ అధికారులతో చర్చించారు. శీతల పానీయాల తయారీకి ప్రధానంగా మానేరు నదిలో వర్షాకాలం, చలి కాలంలో నీటి లభ్యత ఉండగా, సిరిపురం, గుంజపడుగు వద్ద పరిశ్రమను ఏర్పాటు చేసినా గోదావరి నీళ్లు అందుబాటులో ఉంటాయి. ఇక్కడే సుందిళ్ల బ్యా రేజీ ఉండడంతో అందులో నీటి నిల్వ చేయడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతుంటాయి. నీటి వసతికి పెద్దగా ఇబ్బందులు ఉండకపోవడంతో కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసింది. అడవిసోమన్‌పల్లి ప్రధాన రహదారికి దూరంగా ఉండడంతో పాటు కొంత అటవీ ప్రాంతం ఉంది. గుంజపడుగు, సిరిపురం పరిసరాల్లో అటవీప్రాంతం లేకపోగా, కాళేశ్వరం ప్రాజెక్టు సుందిళ్ల బ్యారేజీ, సరస్వతి పంప్‌హౌస్, గోదావరిఖని-మంథని ప్రధాన రహదారి ఉండడం కలిసి వచ్చే అంశాలుగా చెప్పుకుంటున్నారు. అడవిసోమన్‌పల్లి గానీ, సిరిపురం వద్ద గానీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోకా కోలా కంపెనీ ప్రతినిధులు భావిస్తున్నారని సమాచారం.

● రాష్ట్రంలో రెండో యూనిట్..

హిందూస్థాన్ కోకా కోలా బేవరేజెస్ కంపెనీ యూనిట్‌ను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ముందుకు రాగా, ఈ యూనిట్ రాష్ట్రంలో రెండవది కానున్నది. ఇప్పటికే రంగారెడ్డి శివారులోని అమీన్‌పూర్‌లో మొదటి యూనిట్‌ను స్థాపించారు. రెండవ యూనిట్‌ను సిద్దిపేట జిల్లాలో 1000 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధులు 2022 ఏప్రిల్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ మేరకు గజ్వేల్ నియోజకవర్గంలో భూ సేకరణ కూడా చేపట్టారు. నీటి వసతి అంతగా లేనందున చివరి నిమిషంలో యూనిట్‌ను నెలకొల్పేందుకు తప్పుకున్నట్లు సమాచారం. పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ స్థలంతో పాటు ఆశించిన మేరకు నీటి వసతి ఉండడంతో ఇక్కడే పరిశ్రమను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలుస్తున్నది. ఆ సంస్థకు ప్రభుత్వం కావాల్సిన భూములను అప్పగించిన తర్వాత ఒక ఏడాదిలో భవనాలు, గోదాములు, షెడ్లు నిర్మించి యంత్రాలు బిగించి ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. మొత్తంగా జిల్లాలో మరొక పరిశ్రమ ఏర్పాటు కానుండడంతో నిరుద్యోగ యువతీ యువకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు మంత్రి శ్రీధర్‌బాబు గురువారం చేరుకోనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటు గురించి పూర్తి వివరాలను ప్రకటించనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

రామగుండం బీ పవర్‌హౌస్ స్థానంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి

- జెన్‌కో సీఎండీని కోరిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



జెన్‌కో సీఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూన్ 12: రామగుండం బీ పవర్‌హౌస్ స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని బుధవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ జెన్‌కో సీఎండీ రిజ్వి, డైరెక్టర్ అజయ్‌ని కోరారు. బీ పవర్‌హౌస్ స్థానంలో 800మెగావాట్ల విద్యుత్ కేంద్రం వస్తున్నందున జెన్‌కోలో పని చేస్తున్న సిబ్బందిని బదిలీ చేయవద్దని, ప్రస్తుతానికి అందులోనే విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. సీనియర్లతో నూతనంగా ఏర్పాటు చేసే ప్లాంట్‌లో వారిసేవలను వినియోగించుకోవాలని ఆయన సీఎండీకి విజ్ఞప్తి చేశారు.

ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి

పెద్దపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పెద్దపల్లి విద్యుత్ శాఖ ఎస్ఈ బొంకూరి సుదర్శన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ ఇంజనీర్స్, ఏడీఈ, ఏఈ సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం నందు ప్రతి సోమవారం ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, అదేవిధంగా ఎస్ఈ కార్యాలయంలో ప్రతి సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లాటరీ ద్వారా బెస్ట్ అవైలబుల్ సీట్ల కేటాయింపు

పెద్దపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం ద్వారా ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, లాటరీ పద్ధతిన సీట్లను కేటాయించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దరఖాస్తుదారుల సమక్షంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి పెద్దపల్లి జిల్లాలో గల బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) కింద పాఠశాలల్లో ఒకటవ తరగతి (నాన్ రెసిడెన్షియల్)లో 139 మంది దరఖాస్తు చేసుకోగా 70 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్)లో 118 మంది దరఖాస్తు చేసుకోగా 73 సీట్లు లాటరీ పద్ధతిలో కేటాయించామని తెలిపారు. మొత్తం 143 సీట్లు ఎంపిక చేయగా 10 శాతం అదనంగా 14 సీట్లు రిజర్వ్‌లో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నాగలైశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, గురుకుల ప్రిన్సిపాల్ కోఆర్డినేటర్ జె.జె. థెరిస్సా, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. రోగులకు ప్రాణ సంకటం..



నిర్మాణం చుట్టూ కానరాని రక్షణ చర్యలు

కళ్యాణ్‌నగర్, జూన్ 12: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ఐదు అంతస్థుల భవనం చుట్టూ కాంట్రాక్టర్ రక్షణ చర్యలు పాటించకపోవడం రోగులకు ప్రాణసంకటంగా మారింది. రూ.141కోట్లతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న ఐదు అంతస్థుల భవనం చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు ఏర్పాటు చేయకపోవడంతో నెల రోజుల క్రితం విఠల్‌నగర్‌కు చెందిన రావుల విజయ్ అనే యువకుడు గుంతలో పడి మృతిచెందాడు. ఆసుపత్రి నిర్మాణం కోసం లోతుగా తవ్వడంతో రాత్రి వేళ అది కనిపించకపోవడంతో విజయ్ అనే వ్యక్తి నీటి గుంతలో పడి మృతిచెందాడు. కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్న తీరుపై రోగులు, సిబ్బంది మండిపడుతున్నారు. పాత బిల్డింగ్‌కు రావాలన్నా ఇదే రహదారి నుంచి వెళ్లాల్సి వస్తుంది. రాత్రి వేళల్లో సరిగా దారి కనిపించక అందులో పడిపోతున్నారు. కొంత మంది అదృష్టం బాగుండి గాయాలతో బయటపడగా విజయ్ అనే వ్యక్తి మృతికి కాంట్రాక్టరే కారణమంటూ స్వచ్ఛంద సంఘాల నాయకులు ఆందోళన కూడా నిర్వహించారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణ పనుల చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉండగా తాత్కాలికంగా రేకులు ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారు. కాంట్రాక్టర్ వల్ల ఎందరో గుంతల్లో పడిపోతున్నారని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రోగులు, వారి బంధువులు, వైద్య సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

మహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు : కలెక్టర్

మంథని, జూన్ 12: మంథని శ్రీమహాలక్ష్మి దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధంచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక శ్రీమహాలక్ష్మి దేవాలయాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం సందర్శించి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహాలక్ష్మి ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. ఆలయం సమీపంలోగల రావుల చెరువుకట్ట సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. రావుల చెరువు కట్టపై గ్రీనరీ ఏర్పాటు చేయాలని, మినీ ట్యాంక్‌బండ్‌లాగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధంచేయాలని, లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. పురావస్తు శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ శ్రీమహాలక్ష్మి దేవాలయం ఆడిటోరియం అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. కలెక్టర్‌కు మంథని ఆర్డీవో హనుమానాయక్ స్వాగతం పలుకగా ఆలయంలో శాలువాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ రాజయ్య, ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ అధికారులు, దేవాలయం పూజారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన

పెద్దపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ధ్రువపత్రాల పరిశీలన ఈనెల 13న జరుగుతుందని డీఈవో మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో రెండు లేదా అంతకన్నా ఎక్కువ సీనియార్టీ లిస్టులో పేరు ఉన్నవారు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు తమ సర్వీస్ బుక్‌తో జూన్ 13న ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

జేఎన్టీయూలో వార్షికోత్సవ హంగామా

రామగిరి, జూన్ 12: జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్ఎఫ్‌సీఎల్ సీజీఎం సుధీర్‌కుమార్ హాజరై జ్యోతిప్రజ్వలన చేపట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్ర మాలతో హంగామా చేశారు. ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, హెచ్‌వోడీలు దుర్గారావు, సూప రింటెండెంట్ రవీ కుమార్, డీఈఈ సతీష్ తదితరులు హాజరయ్యారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కళ్యాణ్‌నగర్, జూన్ 12: రామగుండం ఎన్టీపీసీలో మృతిచెందిన అర్జున్ మరండి అనే కాంట్రాక్టు కార్మికుడి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని, ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపైన, రక్షణపై లేదని ఆరోపించారు. రక్షణ చర్యలు చేపట్టకపోవడంవల్లనే అర్జున్ మరండి పనులు చేస్తూ పడి మృతిచెందాడని, ఇప్పటికైనా యాజమాన్యం రక్షణ చర్యలు పాటించి కార్మికుల ప్రాణాలను కాపాడాలన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

పెద్దపల్లి రూరల్, జూన్ 12 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని, అది సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభమైన సందర్భంగా సందర్శించారు. పాఠశాలకు విచ్చేసిన కలెక్టర్‌కు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ అమ్మ ఆదర్శ కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. రాత్రి పూట పాఠశాల వద్ద అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని, దీనికి గ్రామ పెద్దల సహకారం తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గేటు లేదని, పాఠశాల ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయని, గేటు ఏర్పాటు చేయాలని ఓ విద్యార్థి కోరగా, వెంటనే స్పందించిన 50వేల రూపా యల చెక్కును కలెక్టర్ ప్రధానోపాధ్యాయులకు అందించారు. అనంతరం ఆయన పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీవో సుదర్శన్, ప్రధానోపాధ్యాయులు వి.హనుమంతు, పీఈటీ సురేందర్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ జె.శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

వలస కార్మికుల పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి : కలెక్టర్

పెద్దపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ వాణిజ్య వ్యాపార రంగాలలో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఇటుక బట్టీలు, హోటల్స్, ఇతర వాణిజ్య వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని ఇటుక బట్టిలను తనిఖీ చేసి వలస కార్మికుల పిల్లలకు సంబంధించి ఏజ్ గ్రూప్ వారీగా ఆడిట్ నిర్వహించి రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. వలస కార్మికుల పిల్లలను వెంటనే సమీపంలోగల అంగన్వాడీకేంద్రం లేదా ప్రభుత్వ పాఠశాలలో తప్పనిసరిగా జాయిన్ చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వలస కార్మికుల పిల్లల పూర్తి బాధ్యత సదరు యాజమాన్యాలు తీసుకోవాలని, రాష్ట్రంలో ఉన్నంతవరకు వారికి పౌష్టికాహారం అందించడం, మంచి విద్య అందించడం మన బాధ్యతని, దీనిని ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో వలస కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, కార్మిక చట్టాలను కట్టుదిట్టంగా అమలుచేయాలని, వేధింపులు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, డీసీపీవో కమలాకర్, అసిస్టెంట్ లేబర్‌ఆఫీసర్ రామ్మోహన్, పెద్దపల్లి సీఐ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మంథని మున్సిపాలిటీలో కీలక పోస్టులన్నీ ఖాళీ..

● ఆరేళ్ళుగా జాడలేని రెగ్యులర్ అధికారులు ● ఇన్‌చార్జీలు, డిప్యూటేషన్ల పైనే విధులు ● పరిపాలన, అభివృద్ధి పనులపై ప్రభావం

మంథని, జూన్ 12: మంథని మున్సిపాలిటీలో కీలక అధికారుల పోస్టులన్ని ఏళ్ల తరబడి ఖాళీగానే ఉన్నాయి. 2018 ఆగస్టు 2న మంథని మున్సిపాలిటీగా ఆవిర్భవించిన నాటినుంచి ఇప్పటివరకు ప్రజా పాలన, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ నిర్వహించాల్సిన పలు కీలక పోస్టులన్నింటిని ఇన్‌చార్జీలు, డిప్యూటేషన్లతో నెట్టుకొస్తున్నారు. ఫలితంగా మంథని మున్సిపాలిటీలో వేగవంతంగా జరగాల్సిన ప్రజా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నీరుగారి పోతున్నది. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ఉన్న మంథని మేజర్ గ్రామపంచాయతీని ప్రభుత్వం 2018లో జనాభా ప్రాతిపాదికన 13 వార్డులుగా విభజించి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. అప్పటినుంచి ఇప్పటివరకు పలు కీలక శాఖల అధికారులను రెగ్యులర్‌గా నియమించలేదు. డిప్యూటేషన్లు, ఇన్‌చార్జిలతో పరిపాలన కొనసాగిస్తున్నారు. దాదాపు 6 సంవత్సరాలుగా మున్సిపాలిటీలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గత ప్రభుత్వం ఈ విధంగానే వ్యవహరించగా, తాజాగా ఏర్పడిన కాంగ్రెస్ హయాంలో కూడా మంథని మున్సిపాలిటీ అధికారులను రెగ్యులర్ పోస్టుల్లో నియమించడం లేదు. దీంతో ఇన్‌చార్జీలు, డిప్యూటేషన్లపై ఉన్న అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. వార్డుల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ఆఫీస్‌లో పరిపాలన విభాగాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా పాలకవర్గం సైతం ఉత్సాహంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలుచేయడానికి వీలు కలగడం లేదు. కార్యాలయంలో ఉద్యోగులు సైతం ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్న తమకు అనుకూలమైన వారి పనులనే చక్కపెడుతున్నారు. సామాన్యులు వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వెళితే కింది స్థాయి ఉద్యోగులు సరిగ్గా వ్యవహరించడం లేదు. ఈ విషయాన్ని పైఅధికారుల దృష్టికి తీసుకెళ్దామంటే వారంతా ఇన్‌చార్జీలు, డిప్యూటేషన్లతో ఎక్కడెక్కడో విధులు నిర్వహిస్తూ అందుబాటులో ఉండటం లేదు. కనీసం ఫోన్ చేసినా స్పందన లేదని పలువురు బాధితులు వాపోతున్నారు.




మంథని మున్సిపల్ కార్యాలయం

ముఖ్యమైన పోస్టులన్నీ ఖాళీలే..

మంథని మున్సిపాలిటీలో ప్రధానంగా ఉండాల్సిన మున్సిపల్ కమిషనర్, మేనేజర్, ఏఈ, అకౌంటెంట్, టీపీవో, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులన్నీ ఆరెళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం మంథని కమిషనర్‌గా వ్యవహరిస్తున్న మేనేజర్ గుట్టల మల్లికార్జునస్వామి ఎఫ్ఏసీ కమిషనర్‌గా ఇటీవల బదిలీపై వచ్చారు. మంచిర్యాల జిల్లాలో పలు మున్సిపాలిటీలకు టీపీవోగా వ్యవహరిస్తున్న ఉద్యోగే మంథని ఇన్‌చార్జి టీపీవోగా పనిచేస్తున్నారు. రామగుండం మున్సిపాలిటీకి చెందిన అకౌంటెంట్ మంథని ఇన్‌చార్జి అకౌంటెంట్‌గా వ్యవహరిస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. టీపీవో రెగ్యూలర్‌గా లేని కారణంగా అక్రమ నిర్మాణాలు, సెట్‌బ్యాక్ తీసుకోకుండా భవనాలు నిర్మిస్తున్నారు. 2 నెలల క్రితం దాదాపు 10 నిర్మాణంలో ఉన్న భవనాలను సెట్‌బ్యాక్ లేని కారణంగా కోర్టు అనుమతితో మున్సిపల్ అధికారులు కూల్చివేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ప్రభుత్వం నియమించిన వార్డు ఆఫీసర్లతో 13వార్డుల్లో శానిటరీ విధులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా, మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మున్సిపాలిటీలో కీలక అధికారుల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు

- పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్



మున్సిపాలిటీలో పరిపాలన, అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పరిపాలనలో అధికారుల కొరత కారణంగా నూతనంగా ఏర్పాటైన మంథనిలో కొన్ని పోస్టుల్లో ఇన్‌చార్జిలు ఉన్నప్పటికి వారితో సమయం తీసుకొని ప్రజలకు కావాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకుంటున్నాం. మేము, మా పాలకవర్గం నిరంతరం వార్డుల్లో సందర్శించి ప్రజల సమస్యలను గుర్తించి వాటి నివారణ కోసం అధికారుల ద్వారా చర్యలు తీసుకుంటున్నాం. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో మున్సిపాలిటీలో పూర్తిస్థాయి అధికారుల నియామకం కోసం కృషి చేస్తాం.

నిజామాబాద్-వరంగల్ మార్గంలో డీలక్స్ బస్సు సర్వీసు

భగత్‌నగర్, జూన్ 12: నిజామాబాద్-వరంగల్ మార్గంలో కొత్తగా డీలక్స్ బస్సు సౌకర్యం కల్పించినట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎస్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్-వరగంల్ మార్గంలో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్తగా కల్పించిన డీలక్స్ బస్సు సౌకర్యాన్ని ప్రయాణికులు వినియో గించుకోవాలని కోరారు. వరంగల్ వైపు నిజామాబాద్ నుంచి 6.00, 6.45, 7.30, 8.00, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 గంటలకు, మెట్‌పల్లి నుంచి 7.30, 8.15, 9.00, 9.30, 10.00, 10.30, 14.30, 15.15, 16.00, 16.30, 17.00, 17..30 గంటలకు బయలుదేతుతోందన్నారు. కోరుట్ల నుంచి 7.45, 8.30, 9.15, 9.45, 10.15, 10.45, 14.45, 15.30, 16.15, 16.45, 17.15, 17.45 గంటలకు జగిత్యాల నుంచి 10.00, 10.45, 11.30, 12.00, 12.30, 13.00, 17.00, 17.45, 18.30, 19.00, 19.30, 20.00 గంటలకు, అదే విధంగా వరంగల్ నుంచి నిజామాబాద్‌కు 6.00, 6.45, 7.30, 8.00, 8.30, 9.00, 13.00, 13.45, 14.30, 15.00, 15.30, 16.00 గంటలకు డీలక్స్ బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ సర్వీసులు 13వ తేదీ గురువారం నుంచి ప్రారంభిస్తున్నామని, ప్రయాణికులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కాంట్రాక్టరుపై కత్తితో దాడి

జ్యోతినగర్, జూన్ 12: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌతమి నగర్‌లో బుధవారం మేకల మల్లేష్ అనే కాంట్రాక్టరుపై పాత నేరస్తుడు మేకల కుమార స్వామి కత్తితో దాడి చేశాడు. దాడికి పాల్పడిన కుమార స్వామి గతంలో జరిగిన కాంట్రాక్టరు మల్లేశ్ తమ్ముడు మేకల లింగయ్య హత్య కేసు లో ప్రధాన నిందితుడు. బాధితుడు మేకల మల్లేశ్ కథనం ప్రకారం వివరా లిలా ఉన్నాయి. కాంట్రాక్టరు మల్లేశ్ గోదావరిఖని నుంచి వస్తున్న క్రమంలో గౌతమి నగర్ వద్ద మేకల కుమారస్వామి తారసపడి మల్లేశ్ వాహనాన్ని ఆపి వాదనకు దిగాడని తెలిపాడు. తన ఇంటి వద్ద రెండుసార్లు ఎందుకు తిరిగా వంటూ మల్లేశ్ అడగడంతో కుమారస్వామి తన దగ్గర ఉన్న కత్తితో మల్లేశ్‌పై దాడి చేశాడన్నాడు. దీంతో తన జీపులో ఉన్న రాడ్డు తీసి బెదిరించడంతో పారిపోయాడన్నాడు. దీంతో మల్లేశ్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ మేరకు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్, జూన్ 12: సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డుకు చెం దిన రమేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసై తరచూ తాగి వచ్చి భార్యతో గొడవపడే. మంగళవారం రాత్రి కూడా భార్యభర్తల మధ్య గొడ వ జరిగింది. ఈ నేపథ్యంలో భార్య పక్కనే ఉన్న వారి మరో ఇంటిలో పడుకుం ది. బుధవారం తెల్లవారుజామున లేచి తన ఇంటికి రాగా భర్త రమేష్ (35) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్ తెలిపారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ ఆలస్యం?

నీట్-2024పై రగడే కారణం!.. తెలంగాణలో 56 కాలేజీల్లో 8,515 ఎంబీబీఎస్ సీట్లు

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియ ఈ ఏడాది ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. నీట్-2024పై దేశ వ్యాప్తంగా జరుగుతున్న రగడే ఇందుకు కారణం. నీట్ మార్కులపై ఇప్పటికే సుప్రీం కోర్టులో కేసు నడుస్తోంది. నీట్-2024ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిల్‌ను కోర్టు తోసిపుచ్చింది. కానీ, నీట్ విషయంలో మరిన్ని కేసులు పడే అవకాశం ఉందని, విషయం అంత త్వరగా తేలేట్లుగా కనిపించడం లేదని జాతీయ వైద్య విద్య కమిషన్(ఎన్ఎంసీ) అధికారులు రాష్ట్ర వైద్య విద్య ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. మరోపక్క, దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలు, వాటిలోని సీట్ల వివరాలను ఎన్ఎంసీ తన వెబ్‌సైట్‌లో పెట్టింది. విద్యార్థులు ఆయా కళాశాలల్లోనే చేరాలనే పేర్కొంది. ఎన్ఎంసీ వెబ్‌సైట్ ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు కలిపి తెలంగాణలో 56 వైద్య కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో మొత్తం 8,515 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

కొత్త కాలేజీల సంగతేంటో?

రాష్ట్రం ప్రభుత్వం దరఖాస్తు చేసిన కొత్త వైద్య కళాశాలల అనుమతిపై ఎన్ఎంసీ ఏటూ తేల్చడం లేదు. అనుమతి ఇస్తారో ? ఇవ్వరో కూడా స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కొత్త కళాశాలల్లో ఈ ఏడాది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడం అనుమానంగానే ఉంది. గద్వాల, వరంగల్(నర్సంపేట), యాదాద్రి, మేడ్చల్ (కుత్బుల్లాపూర్), నారాయణపేట, ములుగు, మెదక్, రంగారెడ్డి(మహేశ్వరం) జిల్లాల్లో వైద్య కళాశాలల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టు- సెప్టెంబరులో ఎన్ఎంసీకి దరఖాస్తు చేసింది. ఆయా కళాశాలలను వర్చువల్‌గా, స్వయంగా తనిఖీ చేసిన ఎన్ఎంసీ బృందాలు పలు లోపాలను ఎత్తి చూపి వాటిని సరిచేసుకోవాలని సూచించాయి. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ లోపాలను సవరించింది. అయితే వైద్య కళాశాలలకు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్ఓపీ) ఇచ్చేముందు ఎన్ఎంసీ బృందాలు మరోమారు తనిఖీ చేస్తాయి. మరికొద్ది రోజుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఎన్ఎంసీ బృందాలు ఇప్పటిదాకా మళ్లీ తనిఖీలకు రాలేదు. నిజానికి, తాము ఎత్తిచూపిన లోపాలను సరి చేసుకున్నట్టు చూపించిన తర్వాత వాటికి సంతృప్తి చెందితేనే ఎన్ఎంసీ అనుమతి ఇస్తుంది. ఒకవేళ అనుమతి ఇవ్వకపోతే ప్రభుత్వం అప్పీలు చేసుకునే వీలుంటుంది. ప్రభుత్వ కళాశాల కాబట్టి సర్కారే గ్యారంటీగా ఉండి లోపాలను సవరించుకుంటామని లిఖితపూర్వక హామీనిస్తుంది. దాంతో ఎన్ఎంసీ అనుమతి మంజూరు చేస్తుంది. ఈ వ్యవహారానికి 20-30 రోజుల సమయం పడుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. దీంతో త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్య సంచాలకులు ఎన్ఎంసీకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎన్ఎంసీ ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. మరోపక్క, అనుమతుల విషయమై కొన్ని వైద్య కళాశాలల యాజమాన్యాలు ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి చర్చినట్టు సమాచారం.

గ్రూప్-1 మెయిన్స్ 7 రోజులు

(మొదటిపేజీ తరువాయి)

మీడియంలోనే రాయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న సమయంలోనే ఏ మీడియంలో రాసేదీ తెలపాల్సి ఉంటుంది. ఒక పరీక్ష తెలుగులో, మరో పేపర్‌ను ఇంగ్లిష్‌లో రాయడానికి వీల్లేదు. అలా వేర్వేరు మాధ్యమాల్లో రాసినవారి పేపర్లను పరిగణనలోకి తీసుకోరు. రాష్ట్రంలో సుమారు 563 గ్రూపు-1 పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నారు. అందులో ఉత్తీర్ణులైనవారిని.. ఒక్కో పోస్టుకు 50 మంది అభ్యర్థుల చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేయనున్నారు. మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు. ఈ నియామకాల్లో ఏలాంటి ఇంటర్వ్యూలూ ఉండవు. మెయిన్ పరీక్షలకు సంబంధించిన వివరాలను కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..

ఇదీ షెడ్యూలు

తేదీ	పేపర్
అక్టోబరు 21	జనరల్ ఇంగ్లిష్
అక్టోబరు 22	జనరల్ ఎస్సే (పేపర్-1)
అక్టోబరు 23	చరిత్ర, కల్చర్ అండ్ జాగ్రఫీ (పేపర్-2)
అక్టోబరు 24	ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం-గవర్నెన్స్ (పేపర్-3)
అక్టోబరు 25	ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ (పేపర్-4)
అక్టోబరు 26	సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ (పేపర్-5)
అక్టోబరు 27	తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ (పేపర్-6)

- పరీక్షల తొలిరోజు అయిన అక్టోబరు 21న క్వాలిఫైయింగ్ టెస్ట్ (జనరల్ ఇంగ్లిష్ పరీక్ష) నిర్వహించనున్నారు. అనంతరం ఇతర పేపర్ల పరీక్షలను నిర్వహిస్తారు. క్వాలిఫైయింగ్ టెస్ట్ కాకుండా మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లకు పరీక్షలను నిర్వహిస్తున్నారు.
- పరీక్షలన్నీ హైదరాబాద్, దాని చుట్టు పక్కల హెచ్ఎండీఏ పరిధిలోనే జరుగుతాయి.
- ప్రతిపేపర్‌లోనూ 150 మార్కులకు ప్రశ్నలుంటాయి.
- అభ్యర్థులు అన్ని పేపర్లూ రాయాల్సి ఉంటుంది. ఏ ఒక్క పరీక్షకు గైర్హాజరైనా ఆ అభ్యర్థులు రాసిన ఇతర పేపర్లను పరిగణనలోకి తీసుకోరు.
- క్వాలిఫయింగ్ పరీక్షను 10వ తరగతి ప్రమాణాలతో నిర్వహిస్తారు. ఇతర పేపర్ల పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను ఇప్పటికే ప్రకటించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ కీ విడుదల

ఈ నెల 9వ తేదీన నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కీని విడుదల చేశారు. గురువారం (13వ తేదీ) నుంచి 17వ తేదీ మధ్య ఈ కీ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కీపై అభ్యంతరాలుంటే.. 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాల్సిందిగా అభ్యర్థులకు అధికారులు సూచించారు.

నేడు లాసెట్ ఫలితాల విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): లాసెట్ ఫలితాలను ఈ నెల 13వ తేదీన విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. గురువారం సాయంత్రం 3.30 గంటలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను ప్రకటించనున్నారు.

నేటి నుంచి రెండోదశ దోస్త్

డిగ్రీలో ప్రవేశాలకు సంబంధించి 13వ తేదీ నుంచి రెండో దశ దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానుంది. మొదటి దశలో సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 15వ తేదీలో ముగియనుంది. 14,15వ తేదీల్లో అభ్యర్థులు తమ వెబ్‌ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఔటర్.. బంగారు బాతే!

వాహనాల రద్దీతో నెల నెలా పెరుగుతున్న ఆదాయం

- ఏప్రిల్‌లో రూ.60 కోట్లు..
- మే నెలలో 62.7 కోట్ల రాబడి



హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు.. ఆదాయ పరంగా బంగారు బాతు అన్నది స్పష్టమవుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీతో ఆదాయం భారీగా పెరుగుతోంది. ప్రతి నెలా హెచ్ఎండీఏ అధికారులు ఊహించని స్థాయిలో రాబడి వస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇచ్చే సందర్భంలో ఓ ప్రైవేటు ఏజెన్సీ మదింపు చేసిన ఆదాయ అంచనాలన్నీ తలకిందులవుతున్నాయి. అప్పుడు.. ఏడాదికి 2శాతం నుంచి 3శాతం వరకు ఆదాయం పెరుగుతుందని అంచనాలు వేయగా, ప్రస్తుతం ఒక్కో నెలకే 4శాతానికి పైగా పెరుగుతోంది. టోల్ చార్జీలు పెంచకముందే ఆదాయం ఈ స్థాయిలో పెరుగుతుండడంతో.. చార్జీల పెంపుతో మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఔటర్ ఆదాయంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాలు అక్షరసత్యాలు అని నిరూపితమవుతున్నాయి. గతేడాది ఔటర్ రింగ్ రోడ్డును హెచ్ఎండీఏ గత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. దీంతో ఏటేటా భారీ ఆదాయాన్ని సమకూర్చే ఔటర్‌ను చాలా తక్కువ బిడ్‌కు 30 ఏళ్లకు లీజుకివ్వడాన్ని ప్రస్తావిస్తూ.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతోపాటు ఔటర్‌పై ఏటా పెరిగే ఆదాయ, వ్యయాలను అంచనా వేసి చూపిస్తూ.. రాష్ట్రానికి బంగారు బాతు లాంటి ఔటర్‌ను ప్రైవేటుపరం చేయడాన్ని పేర్కొంటూ 'బంగారు బాతు.. బలి' అనే శీర్షికతో కథనం ప్రచురించింది. ఈ కథనాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారడంతోపాటు అప్పటి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. విపక్షాలకు అస్త్రంగా మారాయి. ఆ కథనాలన్నీ ఇప్పుడు అక్షరసత్యాలుగా నిరూపితమవుతున్నాయి.

టోల్ చార్జీల పెంపుతో సంబంధం లేకుండానే

ఔటర్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించిన సందర్భంలో ఆదాయాన్ని మదింపు చేసిన ఏజెన్సీ. ఏటా 2శాతం నుంచి 3శాతానికి అటు, ఇటుగా రాబడి పెరుగుతుందని అంచనాలు వేసింది. ముఖ్యంగా హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపీఐ) ప్రకారం ఏటా టోల్ చార్జీల్లో చోటుచేసుకునే 4శాతం నుంచి 5శాతం పెంపుదల మేరకే ఆదాయం పెరుగుతుందని ఆ ఏజెన్సీ తేల్చింది. సాధారణంగా ఏప్రిల్ నుంచి కొత్తగా అందుబాటులోకి వచ్చే టోల్ చార్జీలతో ఆ ఆర్థిక సంవత్సరానికి ఆదాయం పెరుగుతుందని హెచ్ఎండీఏ అధికారులు కూడా అంచనాలు వేశారు. కానీ, ప్రస్తుతం టోల్ చార్జీలు పెంచకుండానే ప్రతి నెలా ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.60.2 కోట్ల ఆదాయం రాగా, మే నెలలో రూ.62.7 కోట్లు వచ్చింది. అంటే దాదాపు రూ.2.5 కోట్లు పెరిగింది. ఒక్క నెలకే 4.2 శాతం పెరుగుదల నమోదైంది. ఈ పెరుగుదల గతేడాది నుంచి కొనసాగుతోంది. ఔటర్‌పై రోజు రోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుండడంతో ఆ మేరకు ఆదాయం పెరుగుతోంది. కాగా, డబ్ల్యూపీఐ ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ చార్జీలు ఏప్రిల్ 1 నుంచే పెరగాలి. కానీ, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని పెంచకుండా నిలిపివేశారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడంతో టోల్ చార్జీలు పెంచుకోవడానికి అవకాశం కల్పించారు. దాంతో ఈ చార్జీలు 4శాతం నుంచి 5శాతం మేర పెరిగాయి. ఇందుకు అనుగుణంగా ఆదాయం పెరుగుతుందని, వాహనాల రద్దీ ద్వారా వచ్చే ఆదాయం అదనంగా ఉంటుందని హెచ్ఎండీఏ- హెచ్‌జీసీఎల్‌కు చెందిన ఓ అధికారి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కథలాపూర్, జూన్ 12: పొలం వద్ద ఓ వ్యక్తికి దారి ఇవ్వనం దుకు తనకు జరిమానా విధించారని మనస్థాపం చెందిన దుంపెట కు చెందిన అరిగెల రాజేశం (35) అనే రైతు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరిగెల రాజేశం పొలం వద్ద కొంత కాలంగా దారి గురించి వివాదం కొనసాగుతోంది. రాజేశం భూమి నుంచి దారి ఇవ్వాలని పక్కనే ఉన్న రైతు కోరగా రాజేశం నిరాకరించాడు. దీంతో పంచాయతీ పెట్టి రాజేశంకు జరి మానా విధించడం వల్ల తీవ్ర మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశా డు. వెంటనే కథలాపూర్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారని చెప్పారు. ప్రాథమికంగా వచ్చిన సమాచారం మేరకు బాధితుని నుంచి వివరాలు సేకరించామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

కొడిమ్యాల, జూన్ 12 : మండలంలోని చెప్యాల గ్రామ శివారులో బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా అక్రమంగా నల్ల మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌తో పాటు జేసీబీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు అనుమతి లేకుండా జేసీబీతో ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తుండగా వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇసుక, నల్ల మట్టిని అనుమతి లేకుండా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఊరట

జీఓ నెం.970 తప్పిదాలపై ముఖ్యమంత్రి రేవంత్ సీరియస్

సరిచేసిన ప్రభుత్వం... జీఓ నెం.1037 జారీ

పాత జీఓల ప్రకారమే నాన్ పీహెచ్ వర్కర్లకు వేతనాలు

కోల్‌సిటీ, జూన్ 12: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల వేతనాలకు సంబంధించి జీఓ నం.970లో జరిగిన పొరపాట్లను సవరించింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం జీఓ నం. 1037జారీ చేసింది. జీవో నం.970లో నాన్ పీహెచ్ వర్కర్లకు సంబంధించి అనెక్స్-2లో పేర్కొన్న వివరాలపై స్పష్టతనిచ్చింది. గతంలో జారీచేసిన జీవో 14,60,63 ప్రకారమే వేతనాలు చెల్లిస్తారని, ఆ జీవోలనే పరిగణనలోకి తీసుకోవాలంటూ పేర్కొన్నది. ఈ మేరకు ఫైనాన్స్ విభాగం జాయింట్ సెక్రటరీ కే హరిత ఆదేశాలు జారీచేశారు.

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న 30955మంది అవుట్ సోర్సింగ్ కార్మికుల వేత నాలకు సంబంధించి ప్రభుత్వం గత నెల 5న జీవో నం.970 జారీ చేసింది. ఈ జీఓను అనుసరించి పీహెచ్ వర్కర్లకు, నాన్ పీహెచ్ వర్కర్లకు కేవలం రూ.16,600వేతనాలు చెల్లిస్తారని పేర్కొన్నది. దీంతో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, నాన్ పీహెచ్ వర్కర్లు ఆందోళనకు గురయ్యారు. శానిటేషన్ విభాగంలో కూడా డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మంచినీటి సరఫరా విభాగంలో ఎలక్ట్రిషియన్లు, ప్లంబర్లు, ఫిట్టర్లు, టెక్నికల్, నాన్ టెక్నికల్ స్టాఫ్, కార్యాలయాల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర ఉద్యోగులు ఆందోళనకు లోనయ్యారు.

ప్రస్తుతం వీరికి రూ.19500 నుంచి రూ.23 వేల వరకు వేతనాలు చెల్లిస్తుండగా కొత్త జీవోతో రూ.16600 పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో మున్సిపల్ కార్మికులకు షాక్ శీర్షికన కథనం ప్రచురితమైంది. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ సైతం ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీవో పరిణామాలపై ఆరా తీసి వెంటనే సరి దిద్దాల్సిందిగా ఆదేశించినట్టు సమాచారం. మున్సిపల్‌శాఖ దీనిపై వివరాలను తెప్పించుకున్నది. మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం ఈనెల 10న ఆర్‌వోసీ 704292/2024/కే2 ద్వారా ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖను అనుసరించి జీవో నం.970లో సవరణలు చేస్తూ బుధవారం జీవో ఆర్‌టీ నెం.1037ను ప్రభుత్వం జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులు వేతనాలు యథావిధిగా పొందనున్నారు.

నెత్తురోడిన రహదారి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి
- కామారెడ్డి జిల్లా వాసులుగా గుర్తింపు



అబ్దుల్లా (ఫైల్)



సయ్యద్ చాంద్ (ఫైల్)

గంభీరావుపేట, జూన్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పెద్దమ్మ బస్ స్టేజీ సమీపంలో మూల మలుపు వద్ద బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులను కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం మల్లుపల్లికి చెందిన షేక్ అబ్దుల్లా (32), సయ్యద్ చాంద్ (38)గా గుర్తించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లుపల్లికి చెందిన అబ్దుల్లా గల్ఫ్ వెళ్లేందుకు వీసా ప్రయత్నంలో ఉన్నాడు. వీసా ఇంటర్వ్యూకు వెళ్లేందుకు అదే గ్రామానికి చెందిన సయ్యద్ చాంద్‌తో కలిసి బైక్‌పై సిరిసిల్ల బయల్దేరారు. గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ దాటగానే మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీ కొట్టడంతో ప్రమాదం సంభవించింది. చాంద్ వ్యాన్ ముందు టైర్ల కింద పడి మరణించగా, అబ్దుల్లా డీసీఎం వ్యాన్ బంపర్ తగిలి మృతిచెందాడు. డీసీఎం వ్యాన్ డ్రైవర్ అజాగ్రత్తగా, అతి వేగంగా నడపడంతో ప్రమాదం జరిగిందని అబ్దుల్లా భార్య జయిరాం బీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై రాంమోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి



అశ్విత (ఫైల్)

బీర్‌పూర్,జూన్ 12: మండల కేంద్రానికి చెందిన 9వ తరగతి చదువుతున్న అశ్విత (14) మంగళవారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సముద్రాల సతీష్ సునీతల కుమార్తె అశ్విత మంగళవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో కాలకృత్యా లు తీర్చు కోవడానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా బాత్ రూమ్ ఇనుప డోరుకు విద్యుత్ సరఫరా కావడంతో డోర్‌ను తీస్తున్న క్రమంలో షాక్ తగిలి అశ్విత మృతి చెందింది. అశ్విత తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతురాలు తండ్రి సతీష్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అశ్విత మృతిని తట్టుకోలేక స్నేహితులు కన్నీరు మున్నీరుతో విలపించారు.

రామగుండం ఎన్టీపీసీలో ప్రమాదం

వలస కార్మికుడి మృతి

జ్యోతినగర్, జూన్ 12 : రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో బుధవారం జరిగిన ప్రమాదంలో అర్జున్ మరాండి (37) అనే ఒడిశా వలస కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. ప్రాజెక్టులోని 6వ యూనిట్ యాష్ హ్యాండ్లింగ్ ప్రాంట్(ఏహెచ్‌పి)లో ఈఎస్‌పీల ఆధునికీకరణ పనులు చేస్తున్న క్రమంలో 17 మీటర్ల ఎత్తు నుంచి కింద పడడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు, శరీర భాగాలకు బలమైన గాయాలు తగలడంతో అర్జున్ అక్కడికక్కడే చనిపోయాడు. ఎత్తైన చిమ్నీపై పని చేస్తున్న సమయంలో సేఫ్టీ రోప్ పెట్టుకున్నప్పటికీ కింద పడి చనిపోయాడు. ఒడిశా రాష్ట్రానికి చెందిన అర్జున్ మరాండి ప్రభాత్ ఇంజ నీరింగ్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నా డు. ప్రమాద సంఘటన తెలుసుకున్న ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంగాల జేఏసీ నాయకులు ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలివెళ్లారు. మృతుడి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, అంత్యక్రియలకు లక్ష రూపాయలు ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాయంత్రం వరకు కాంట్రాక్టు సంస్థ, జేఏసీ, యాజమాన్యం మధ్య జరిగిని చర్చలు జరిగాయి. అర్జున్ మరాండి కుటుంబానికి ఎన్టీపీసీ తరుపున ఇన్సురెన్సు కింద 10 లక్షల రూపాయలు, ప్రభాత్ కంపెనీ నుంచి 6 లక్షల రూపాయలు, లక్ష రూపాయలు దహన సంస్కారాలకు నెలరోజుల్లో చెల్లించేదుకు అంగీకారం కుదిరింది. అలాగే వర్క్‌మెన్ కాంపెన్‌సెషన్ స్కీం కింద మరో 15 లక్షలకు పైగా ఎక్స్‌గ్రేషియా వచ్చే అవకాశ ముంది. కాగా, సంఘటన స్థలాన్ని రామగుండం సీఐ అజయ్‌బాబు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అర్జున్ మరాండి(ఫైల్)


ఐతరాజుపల్లిలో పాఠ్యపుస్తకాలు అందిస్తున్న డీఈవో


సుల్తాన్‌పూర్‌లో విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ


తుర్కలమద్దికుంటలో యూనిఫాంలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు

- 'బడి బాట'లో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి

సుల్తానాబాద్, జూన్ 12 : ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించిందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించి డబ్బులను వృథా చేసుకోవద్దని జిల్లా విద్యాశాఖ అధికారిని మాధవి సూచించారు. మండలంలోని ఐతరాజు పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా నూతన విద్యా సంవత్సర ప్రారంభ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో మాధవి పాల్గొని విద్యార్థులకు పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు క్రమం తప్పకుండా స్కూల్‌కు వచ్చి బాగా చదువుకొని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వం పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించిందని, ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఎంపీడీవో దివ్య దర్శన్‌రావు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ ఇంతమంచి సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలోనే మంచి అనుభవం, అర్హత గల ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని సూచించారు. ప్రభుత్వం అందించే పథకాలు ఎలా ఉపయోగించుకుంటున్నారో అలాగే ప్రభుత్వ పాఠశాలను కూడా అలాగే ఉపయోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులు వందశాతం సకాలంలో పూర్తి చేసినందుకు ఛైర్‌పర్సన్ స్వప్నను ఏఈ సతీష్, ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ఉచిత దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేందర్, డీపీఎం, ఏపీఎం, పంచాయతీరాజ్ ఏఈ సతీష్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, వైద్యాధికారి సంతోష్, ఏపీసి ఛైర్‌పర్సన్ స్వప్న, గ్రామకార్యదర్శి కిరణ్, మాజీ సర్పంచ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : ప్రైవేట్ పాఠశాతతకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో బుధవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రారంభమైన మొదటిరోజు విద్యార్థులకు గులాబీ పువ్వులు అందించి గురువులు స్వాగతం పలికారు. విద్యార్థులకు మంజూరైన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద మంజూరైన పనులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం నరేంద్రచారి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అప్పిడి సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ భాగ్యలక్ష్మీ, సిఆర్‌పి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ధూళికట్ట యూపీఎస్ పీఎస్ పాఠశాలల్లో కూడా విద్యార్థులకు ఉపాధ్యాయులు గులాబీ పువ్వులు అందించి స్వాగతం పలికారు. హైస్కూల్ హెచ్‌ఎంలు గంద్ర దేవేందర్‌రావు, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : ఎస్సీ కాలనీ ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరిన పిల్లలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్కులను ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య అందజేశారు. పాఠశాల టీచర్లు, పిల్లలు, తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు ఎడ్ల విజయలక్ష్మి, కర్ర సమత, చెన్నూరి భారతి, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధర్మారం : వేసవి సెలవుల తర్వాత బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ధర్మారం మండలంలో యూపీఎస్ 6, ప్రాథమిక పాఠశాలలు 35. జడ్పీ పాఠశాలలు 10. గురుకుల విద్యాలయాలు 4, కేజీబీవి పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను. యూనిఫాంలను అందజేశారు. పలు పాఠశాలలను ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ఛాయాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలను విద్యార్థులందరికి అందజేయాలని సూచించారు.

ఓదెల : మండలంలోని పాఠశాల విద్యార్థులకు 2024-25 సంవత్సరానికి ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను అందజేసినట్లు సిఆర్‌పి ఓంకార్ తెలిపారు. ఎంఈవో రాజయ్య ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థుల సంఖ్య పరంగా 1వ తరగతి 10వ తరగతి వరకు పాఠ్యపుస్తకాలను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పీలు ఓంకార్, తిరుపతి, రజిత, రాజేందర్, ఐఈఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్యతో పాటు, సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని పెద్దపల్లి ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని తుర్కలమద్దికుంట జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య, ఏపీవో రమేష్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మసీయొద్దిన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మంథనిరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, విలువలు కలిగిన విద్య దొరుకుతుందని జడ్పీ సీఈవో నరేందర్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్తి చేయబడిన పాఠశాల మౌలిక సదుపాయపనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కన్నాల ఉన్నత పాఠశాలలో 2023-24 సంవత్సరంలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిదన్నారు. ఎంపీపీ కొండ శంకర్, డీఎల్‌సీవో శంకర్, సింగిల్‌విండో ఛైర్మన్ కొత్త శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయల పనులు వేగవంతంగా పూర్తి చేయబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణచందర్, డీపీఎం సునంద, మండల విద్యాధికారి దాసరి లక్ష్మి, ఏఈ అనుదీప్, జిల్లా గ్రంథాలయ మాజీ సభ్యులు గుడిసె గట్టయ్య, వీవో అధ్యక్షురాలు రమ, పీఎస్ హెచ్‌ఎంలు మధు, రాధికలు పాల్గొన్నారు.

రామగిరి : కార్పొరేట్ స్థాయిలో విద్యాప్రమాణాలతో కూడిన విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఎంపీపీ ఆరెల్లి దేవక్క అన్నారు. బుధవారం మండలంలోని రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 15మంది విద్యార్థులకు నూతనంగా అడ్మిషన్‌లు చేపించారు.అనంతరం విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేగొలపు సదానందంగౌడ్, ఏపీసీ ఛైర్మన్ మన్నాల స్రవంతి, కార్యదర్శి రమ్య, స్పెషల్ ఆఫీసర్, సమ్మిరెడ్డి, మాజీ సర్పంచ్ బోగే లింగయ్య, కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీ టౌన్ : బడిగంట మోగింది. వేసవి సెలవులు ముగియడంతో 2024-25 విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ గోదావరిఖనిలో విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. బుధవారం గోదావరిఖని గాంధీ పార్క్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలు చేసి తరగతులు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూప్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే విద్యాసంస్థల ప్రారంభం కావడంతో రామగుండం ఎంవీఐ భీమ్‌సింగ్ ఆధ్వర్యంలో పాఠశాల వాహనాల్ని తనిఖీ చేశారు. పాఠశాల వాహనాలు ఫిట్‌నెస్ ఉన్నాయా లేదా, వాహనాల ఆర్‌సీలను, డ్రైవర్ లైసెన్స్‌ను పరిశీలించారు. వాహనం కెపాసిటీకి మించి విద్యార్థులను చేరవేయడం గాని, ఫిట్‌నెస్ లేని వాహనాలను వినియోగించినా చర్యలు తీసుకుంటామని ఎంవీఐ హెచ్చరించారు.

జూలపల్లి : మండలంలో బుధవారం నుంచి పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలను మండల ప్రత్యే అధికారి రంగారెడ్డి సందర్శించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మండలకేంద్రంలో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, ఏఈ సువిశాల, పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కన్నాలలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నరేందర్


రత్నాపూర్‌లో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ


గోదావరిఖనిలో ప్రారంభ పూజలు చేస్తున్న ఉపాధ్యాయులు

నాంసానిపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలు

ఓదెల, జూన్ 12 : మండలంలోని నాంసానిపల్లిలో బుధవారం ముదిరాజ్ కులస్తులకు ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి బోనాల వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు హాజరై ముదిరాజ్‌లతో బోనమెత్తుకొని వెళ్లి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. అనంతరం పెద్దమ్మ ఆలయంలో పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు మూల ప్రేంసాగర్ రెడ్డి, పొత్కపల్లి సింగిల్ విండో ఛైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్థులు వారికి ఘన సన్మానం నిర్వహించారు.

ఎల్లమ్మ పట్నాలలో పాల్గొన్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్ : మండలంలోని తొగర్రాయిలో ఎల్లమ్మపట్నాల మహో త్సవంలో బుధవారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిలుక సతీష్, మిణుపాల ప్రకాష్ రావు, సయిరి మహేందర్, గడ్డం అనిల్, మురళి పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం

కళ్యాణ్‌నగర్, జూన్ 12: గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అమ్మ పరివార్ ఆశ్రమంలో అనాథ పిల్లలకు బుధవారం చిందం రమేష్, రజిత దంపతులు అన్నదానం నిర్వహించారు. రమేష్ తల్లి లక్ష్మీనర్సమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు. రాజేంద్రప్రసాద్, అంకిత్, చెర్రి, కన్నయ్య, శోభ, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆలయాలను రక్షించాలని వినతి

జూలపల్లి, జూన్ 12 : మండలంలోని పలు ఆలయాల్లో వరుస దొంగతనాలు జరుగుతున్నందున వాటిని కాపాడాలని బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో పలువురు ఎస్‌ఐ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దాడి రవి, గడ్డం మల్లారెడ్డి, నాడెం రాజన్న, చొప్పరి నర్సయ్య, చెంద్రయ్య, అజయ్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

970 జీవోను రద్దు చేయాలి

కోల్‌సిటీ, జూన్ 12: తెలంగాణలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న దాదాపు 30955మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల వేతనాలు పెరగడం అటుంచి తగ్గించడం సరికాదని సీఎం రేవంత్, సీడీఎం ఏలకు మద్దెల దినేష్ లేఖ రాసినట్టు ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని పీహెచ్, నాన్‌పీహెచ్ వర్కర్లుగా విభజించి అందరికి రూ.16600 సెలవారీ వేతనం నిర్ణయిస్తూ ఈ జీఓ జారీ చేయడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వేతనాలను పెంచుతుందనే ఆశలో వేతనాలు తగ్గేలా జీవో జారీ కావడం ఆందోళన కలిగిస్తోందని కార్మికులు, ఉద్యోగులు పేర్కొంటున్నారన్నారు. జీవో కార్మికవర్గాన్ని ఆందోళనకు గురిచేస్తోందని ఇప్పటికైనా ముఖ్యమంత్రి దీనిపై పునరాలోచన చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు,ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు.



రేపు సర్టిఫికెట్ల పంపిణీ

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 12: ఆర్జీ-2 ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణ పొందిన వారికి ఈనెల 14న శుక్రవారం సర్టిఫికెట్లను అందజేయనున్నట్టు ఏరియా అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన టైలరింగ్, మగ్గంవర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణ పొంది రాత పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారు 14న ఉదయం 10గంటలకు కమ్యూనిటీ హాల్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని ప్రకటనలో పేర్కొన్నారు.

మరణానంతరం ఎస్‌అండ్‌పీసీ గార్డు నేత్రదానం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 12: ఆర్జీ-2 ఏరియాలో ఎస్‌అండ్‌పీసీ గార్డుగా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన కొంకటి అంజయ్య నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. అంజయ్య గుండెపోటుతో గురువారం కన్నుమూశాడు. నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరికి చూపు వస్తుందని,ఆర్జీ-2 కమ్యూనికేషన్ సెల్ కోఆర్డినేటర్ దేవారెడ్డి అంజయ్య కుటుంబీకులకు అవగాహన కల్పించడంతో నేత్రదానానికి అంగీకరించారు. సింగరేణి ఏరియా ఆసుపత్రిలో అంజయ్య నేత్రాలను ఎల్వీప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ సేకరించి ఐబ్యాంక్‌కు తరలించారు. ఇంటి పెద్దను కోల్పోయి దుఖంలో ఉన్న అంజయ్య కుటుంబ సభ్యులు సమాజ శ్రేయస్సు కోరి నేత్రదానానికి ముందుకు రావడం పట్ల సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, సభ్యులు రమేష్, భీష్మాచారిలు అభినందించారు.

దేహ దానానికి ఉద్యోగి అంగీకారం

మార్కండేయకాలనీ, జూన్ 12: గోదావరిఖని శారదానగర్‌కు చెందిన పీ రాజేశ్వరాచారి తన పుట్టిన రోజున అవయవదానికి అంగీకారం తెలిపాడు. సింగరేణి ఆర్జీ-1 ఏరియా వర్క్‌షాప్‌లో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న రాజేశ్వరాచారి సీఐటీయూ నాయకుడిగా కొనసాగుతున్నాడు. బుధవారం తన పుట్టిన రోజు సందర్భంగా వైద్య విద్యార్థుల పరిశోధన కోసం మరణానంతరం తన దేహాన్ని రామగుండం ప్రభుత్వ మెడికల్(సిమ్స్) కాలేజీకి దానం చేస్తానని ప్రకటించారు. ఈ మేరకు రాజేశ్వరాచారికి సదాశయ ఫౌండేషన్ ద్వారా అతనికి అభినందన పత్రాన్ని సీఐటీయూ ఆర్జీ-1 అధ్యక్షుడు అరపెల్లి రాజమౌళి, ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కేఎస్ వాసు, పట్టణ కార్యదర్శి తాడబోయిన రాములు అందజేశారు.

ఆర్జీ-2లో సమస్యలు పరిష్కరించాలి : ఐఎన్‌టీయూసీ

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 12: ఆర్జీ-2 ఏరియాలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఐఎన్‌టీయూసీ నాయకులు జీఎం సూర్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఏరియా వైస్‌ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న 130మంది జనరల్ మజ్దూర్‌లను ఒకే దఫాలో సర్ఫేజ్ జనరల్ మజ్దూర్‌లుగా అనుమతించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వివిధ కేటగిరీల పదోన్నతులను వెంటనే ఇవ్వాలని, ఈపీ ఆపరేట్లరు గతంలో మాదిరిగా కంపెనీ ద్వారా శిక్షణ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, క్యాడర్, ఎస్‌ఎల్‌పీ వెంటనే ఇవ్వాలని జీఎంను కోరారు. కార్మిక వాడలకు శుభ్రమైన తాగు నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, కాలనీ, గోదావరిఖని రోడ్డు మరమ్మతులు చేయాలని, లైబ్రరీని ఆధునీకరించాలని జీఎంకు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అక్రం, సంపత్‌రెడ్డి, సత్యనారాయణ, కృష్ణ, అవినాష్, రమేష్, బాలయ్య,జగదీష్ ఉన్నారు.


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

అధికారికి వీడ్కోలు సన్మానం



అధికారిని సన్మానిస్తున్న జీఎంలు

రామగిరి, జూన్ 12: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఏరియా ఇంజనీర్‌గా పనిచేసి కార్పొరేట్ జీఎం స్టోర్స్‌కు జీఎంగా పదోన్నతితో బదిలీ వెళ్తున్న ఏలిషాకు బుధవారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, తొటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు రాధాకృష్ణ, రాజేందర్, రమేశ్, శ్రీనివాసులు, రఘుపతి, సత్యనారాయణ, వెంకటరమణ, చంద్రశేఖర్, కర్ణ, రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్ల వేతనాల పెంపుదలకు ఉద్యమిస్తాం

యైటింక్లయిన్‌కాలనీ, జూన్ 12: కాంట్రాక్టు డ్రైవర్ల వేతనాలు పెంచడం కోసం సీఐటీయూ ఉద్యమించనున్నట్టు యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొ గిలి పేర్కొన్నారు. బుధవారం ఓసీపీ-3 కృషిభవన్‌లో డ్రైవర్ల సమావేశంలో అయన మాట్లాడారు. 2022 సెప్టెంబర్‌లో అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులు 18 రోజుల సమ్మె చేస్తే యాజమాన్యం దిగివచ్చి 12 డిమాండ్లను అంగీకరిస్తూ ఒప్పందం చేసుకున్నదని, రెండేళ్ళు గడుస్తున్నా వేతనాలు పెంచలేదన్నారు. ఈనెల 10 నుండి కాంట్రాక్టు డ్రైవర్ల సమ్మె అని ఏఐటీయూసీ ఏకపక్షంగా ప్రకటించి సీఐటీయూ కూడా సమ్మెలో పాల్గొంటున్నదని తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. జీవో 22ను గెజిట్ చేసి కాంట్రాక్టు డ్రైవర్ల వేతనాలను 26000కు పెంచాలని, ఈఎస్‌ఐ సదుపాయం, కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో రాజ్‌కుమార్, రామన్న, సతీష్, సంపత్, ఆనంద్, నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలో వసతుల కల్పించాలి

రామగిరి, జూన్ 12: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో వాణి పాఠశాలలో మౌళిక వసతులు, విద్యాప్రమాణాలను మెరుగుపరచాలని కోరుతూ బుధవారం జీఎం సుధాకర్‌రావుకు సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్, అహ్మద్ పాషా, రమణరెడ్డి, కుమార్, వేణుగోపాల్, రవీకుమార్, సుధాకర్, తిరుపతి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బీరన్న పట్నాల మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే


బీరన్న పట్నంలో నాయకులతో ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి రూరల్, జూన్ 12 : మండలంలోని కాపులపల్లిలో గొల్ల కుర్మల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరన్న స్వామి పట్నాల మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు బుధవారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేలు శాలువాతో సత్కరించారు. వారి వెంట ఎంపీటీసీ ఎడెల్లి శంకరయ్య, నాయకులు సందనవేని రాజేందర్, నల్లపు తిరుపతి, మల్లేష్, చిక్కయ్య, సాయి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ పట్నాల మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎలిగేడు, జూన్ 12: ఎలిగేడు మండల కేంద్రంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ పట్నాల మహోత్సవంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, రంగు శ్రీనివాస్‌గౌడ్, సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, దుగ్యాల సంతోష్‌రావు, రంగు శ్రీనివాస్, సింగిరెడ్డి రాంచంద్రారెడ్డి, బూర్ల వెంకటసత్యం, కప్పంపల్లి కొండయ్య, భక్తులు పాల్గొన్నారు.

మాజీ ప్రధానోపాధ్యాయుడి ఉదారత

- విద్యార్థుల ఉన్నతికి రూ. లక్ష వితరణ



విరాళం అందజేస్తున్న రాఘవులు

ఓదెల, జూన్ 12: మండలంలోని మడక ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందానికి బుధవారం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు భాష్యం రాఘవులు విద్యార్థుల ఉన్నతి కోసం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. మడకకు చెందిన రాఘవులు ఇదే పాఠశాలలో 20 ఏళ్ల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి ఇటీవల పదవీ విరమణ పొందారు. అనారోగ్యంతో తన భార్య అహల్య మృతిచెందగా ఆమె జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అశోక్‌రెడి, ఎంపీటీసీ నోముల పద్మావతి-ఇంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రపూర్‌కు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

మంథని, జూన్ 12: మంథని నుంచి మహారాష్ట్రంలోని చంద్రపూర్‌కు ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్దరిరంచాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ, నేతలు పర్వవేన మోహన్, అజీంఖాన్, ఇందారపు సదయ్య, కన్నూరు బాపు, కన్నెబోయిన ఓదెలు, పర్వతాలు మంథని డీఎంకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. చంద్రపూర్, గుగ్గూస్, వనీ లాంటి ప్రాంతాల్లో మంథని నుంచి అనేక కుటుంబాలు వలస వెళ్లి వివిధ రకాల వృత్తుల్లో స్థిర పడ్డారన్నారు. వీరి కోసం, ఈప్రాంత ప్రజల రవాణా సౌకర్యం కోసం గతంలో మంథని నుంచి చంద్రపూర్‌కు బస్సు సర్వీస్‌ను నడిపించినప్పటికీ ఇటీవల రద్దు చేయడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని వారు కోరారు.

పోతారంలో ఘనంగా బోనాల జాతర

ముత్తారం, జూన్ 12: మండలంలోని పోతారం గ్రామంలో బుధవారం ఘనంగా బోనాల జాతరను నిర్వహించారు. గ్రామంలోని గ్రామదేవతలకు పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారికి నైవేద్యాన్ని బోనంతో గ్రామంలోని పురవీధుల గుండా మేళాతాళల మధ్య ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, దొడ్డ బాలాజీ హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చెల్కల జితేందర్ యాదవ్, నర్ర మల్లయ్య, కొమురయ్య, సుకుమార్, వెంకట్రాజం, శ్రీశైలం, సమ్మయ్య, గట్టయ్య, పెద్దసంఖ్యలో గ్రామపెద్దలు హాజరైయ్యారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయుడిని పూర్వ విద్యార్థులు

రామగిరి, జూన్ 12: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం బుధవారం జరిగింది. 2007-08 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒక చోటకు చేరి తమ బాల్యంలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆహ్లాదకర వాతవరణంలో జరిగిన కార్యక్రమంలో నాటి అధ్యాపకులను శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి, మాజీ సర్పంచ్ గంటపద్మ, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, రమేశ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాల పరిశీలన

రామగిరి, జూన్ 12: మండలం కేంద్రంలో కస్తూర్బా పాఠశాలను బుధవారం మండల స్పెషల్ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో శైలజ పరిశీలించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరైయ్యేందుకు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలో వసతులను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఉపాధ్యాయురాలిని ఆదేశించారు.

ఒరిగిన విద్యుత్ పోల్స్‌కు మరమ్మతులు

- 'ఆంధ్రజ్యోతి'కి స్పందన

రామగిరి, జూన్ 12: మండలంలోని బుధవారంపేట్ గ్రామంలో ప్రమాదకరంగా మారిన ఒరిగిన విద్యుత్ పోల్స్‌కు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. 'పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం' అనే 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన విద్యుత్ ఏఈ మహేందర్‌రెడ్డి తక్షణం మరమ్మతులకు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది బుధవారంపేట్ గ్రామంలో ఒరిగిపోయిన విద్యుత్ పోల్స్‌ను ట్రాక్టర్ సహాయంతో పనులు యుద్ధప్రతిపాదిక చేపట్టారు. దీంతో పాటుగా మిడిల్ పోల్ అవసరం ఉన్న ప్రాంతాల్లో నూతనంగా పోల్ ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిపారు. మంజూరు అయిన వెంటనే వేయిస్తామని ఏఈ పేర్కొన్నారు.

పశువుల వారసంతకు వేలం పాట

సుల్తానాబాద్, జూన్ 12: మండలంలోని గర్రెపల్లి గ్రామంలో మండల పంచాయితీ అధికారి ఫయాజ్ ఆలీ ఆధ్వర్యంలో 2024- 25 సంవత్సరానికి గాను పశువుల సంత, కూరగాయల సంత వేలం నిర్వహించారు. ఈ వేలంపాటలో పశువుల సంతకు అత్యధికంగా దీకొండ శ్రీనివాస్ నాలుగు లక్షల 45 వేల 500 రూపాయలు వేలంపాట పాడి కైవసం చేసుకున్నారు. కూరగాయల సంతకు పడాల రంగస్వామి 36 వేలు అత్యధికంగా వేలం పాట పాడి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో గర్రెపల్లి ప్రత్యేక అధికారి, ఎం పీ డీ ఓ దివ్యదర్శన రావు , పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కారొబార్ వెంకన్న పటేల్ గ్రామస్తులు, నాయకులు, పాల్గొన్నారు.